చలివేంద్రం ప్రారంభం



ఖానాజీగూడలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్: బాటసారుల దాహార్తిని తీర్చడం అభినందనీయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెంకటాపురం డివిజన్ ఖానాజీగూడ ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబితా కిషోర్, ఎంపీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు అనిల్, కిషోర్‌గౌడ్, సదానంద్, వీరేష్, కన్నా, శంకర్, రాజశేఖర్, నవీన్, రాము తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నార్కొటిక్స్ పోలీసులు

మల్లాపూర్: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని తెలంగాణ నార్కొటిక్స్ పోలీస్ సూపరింటెండెంట్ పి.సీతారాం అన్నారు. గురువారం మల్లాపూర్ జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత గంజాయి, మత్తు పదార్థాలను సేవించి తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రమేష్, రాచకొండ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, ఎస్సై వెంకటయ్య, 448 బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తడి, పాడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వీ కర్ణన్

కాప్రా: తడి, పొడి చెత్తను వేరుచేసి ఇంటి ముందుకు వచ్చే ఆటో రిక్షాకు ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. గురువారం కాప్రా సర్కిల్ ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని భవానీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమానికి కమిషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు స్థానిక సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, డీసీ జగన్, ఈఈ నాగేందర్, మెడికల్ ఆఫీసర్ మధుసూదనరావు, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్లు, ఎస్‌ఎఫ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్‌సింగ్ గురువారం పనులను ప్రారంభించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, బండి శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం హుండీ లెక్కింపు



రామంతాపూర్: ఓల్డ్ రామంతాపూర్‌లోని మల్లికార్జునస్వామి (శివాలయం) ఆలయానికి చెందిన హుండీని గురువారం ఆలయ ఈఓ కొండూరు సురేంద్ర, చైర్మన్ నామ్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఐదు నెలలకు హుండీ ఆదాయం ఒక లక్షా 3 వేల 648 రూపాయలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సతీష్‌గౌడ్, జంగయ్య, బాలయ్య, శోభ, ప్రధాన అర్చకులు మోత్కూరు శేఖర్‌బాబు శర్మ, నరేందర్, ప్రవీణ్ శర్మ, రాఘవేందర్, నాంచారయ్య పాల్గొన్నారు.

విషవాయువులతో.. ఉక్కిరిబిక్కిరి



బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉంటుందని ప్రజలు ఈ ప్రాంతంలో ఇల్లు కొనుక్కుని నివసిస్తున్నారు. కానీ బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల నుంచి ప్రతి నిత్యం వెలువడుతున్న విష వాయువులతో కంటిమీద కునుకులేకుండా స్థానిక ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. విష వాయువులను వెదజల్లే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు వివిధ రూపాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సైతం కౌన్సిల్‌లో ఈ సమస్యను లేవనెత్తి ప్రభుత్వం దృష్టికి సైతం తీసుకెళ్లారు.

- వివిధ రూపాల్లో స్థానికుల నిరసన
- పట్టించుకోని అధికారులు
- అనారోగ్యంతో బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల ప్రజలు

నిజాంపేట్: బాచుపల్లి, మల్లంపేట్ ప్రాంతాలను ఆనుకుని ఉన్న బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల్లో ఉన్న పలు పరిశ్రమల నుంచి విష వాయువులు వాతావరణంలో కలుస్తున్నాయి. పరిశ్రమల నుంచి విష వాయువులు వెలువడుతుండటంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ విష వాయువులను వదులుతుండటంతో ప్రజలు వివిధ రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చిన్న పిల్లలు ఈ సమస్యతో తీవ్రంగా సతమతమవుతున్నారు.

పెద్ద ఎత్తున పోరాటాలు

పరిశ్రమల నుంచి వెలువడుతున్న విష వాయువులను అరికట్టాలని కార్పొరేటర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు వేలాది మంది పలుమార్లు నిరసన చేపట్టారు. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్య తీవ్రతను వివరించారు. పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. కోర్టును సైతం ఆశ్రయించారు. బాచుపల్లి, మల్లంపేట్, భౌరంపేట్, నిజాంపేట్, మియాపూర్ తదితర ప్రాంతాల్లో అనేక విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ హాస్టల్స్ ఉన్నాయి. వీటిల్లో వేలాది మంది విద్యార్థులు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే విష వాయువులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల తనిఖీలేవి?

పారిశ్రామికవాడలో తనిఖీలు చేయాల్సిన అధికారులు యాజమాన్యాలు ఇచ్చే మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుల సమయంలో నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారని పలువురు పేర్కొన్నారు. అనంతరం రెండు, మూడు రోజుల తరువాత ఈ సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్న చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు.



విషవాయువులను అరికట్టాలని నిరసన తెలుపుతున్న స్థానికులు(ఫైల్)

అధికారులు మొద్దు నిద్ర వీడాలి



ప్రజలు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటుంటే పీసీబీ అధికారులు మాత్రం మొద్దు నిద్ర పోతున్నారు. ప్రజల ప్రాణాలంటే అధికారులకు ఇంత చులకనగా కనిపిస్తున్నాయా?. వేలాది మంది విద్యావంతులు, ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి సమస్య తీవ్రతపై నిరసన చేపట్టినా పీసీబీ అధికారుల్లో చలనం లేకపోవడం బాధాకరం. అధికారులు తమ తీరు మార్చుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

– విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్.

ఇక్కడ బతకలేకపోతున్నాం



పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషవాయువులతో ఇక్కడ బ్రతకలేకపోతున్నాం. స్వచ్ఛమైన గాలి కూడా పీల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. విషవాయువులతో సాయంత్రం, తెల్లావారుజామున బయటకు వెళ్లలేక పోతున్నాం. అధికారులు చర్యలు తీసుకోకుండా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు.

– రాజేశ్, మల్లంపేట్

సరస్వతి పుష్కరాలకు మేడ్చల్ నుంచి ప్రత్యేక బస్సులు

మేడ్చల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం మేడ్చల్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపుతుందని డీఎం సుధాకర్ తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకు రోజూ రాత్రి 8 గంటల మెట్రో డీలక్స్ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. మేడ్చల్ నుంచి పుష్కరాలకు వెళ్లే భక్తులు ఈ ప్రత్యేక బస్సు సౌకరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

ఆర్టీసీ ప్రయాణికులకు తాత్కాలిక షెడ్

మేడ్చల్: మండుతున్న ఎండలతో బస్సుల కోసం బస్టాండ్‌లలో బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికుల కోసం అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. మేడ్చల్ రూట్ 44వ జాతీయ రహదారిపై ఉండటం... రహదారి విస్తరణ పనులు జరుగుతుండటంతో బస్టాండ్‌లలో ఉన్న షెల్టర్లు పూర్తిగా విస్తరణలో వెళ్లిపోయాయి. దీంతో ప్రయాణికులు బస్టాప్‌లలో బస్సుల కోసం ఎండలో నిలబడి వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో అధికారులు బస్టాప్‌లలో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి ప్రయాణికులకు నీడను కల్పించారు.

ఆర్టీఐ కమిషనర్ల నియామకంలో బీసీలకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: సమాచార కమిషనర్ల నియాకమంలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 56 శాతం జనాభా ఉన్న బీసీలలో రాష్ట్ర సమాచార కమిషనర్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత గల ఒక్క అభ్యర్థి కూడా లేరా ? అని ప్రశ్నించారు. నియామకాల్లో బీసీలు ఒక్కరు కూడా లేకపోవడం దారుణమన్నారు.

పూడూర్‌లో ఘనంగా రంగం



భవిష్యవాణి వినిపిస్తున్న పూజారులు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్‌లో గ్రామ దేవతల జాతర సందర్భంగా గురువారం రంగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం బోనాల పండగను నిర్వహించగా గురువారం వరకు గ్రామ దేవతల ఉత్సవాలను జాతరను నిర్వహించారు. పూజారులు రంగం కార్యక్రమం నిర్వహించి భవిష్యవాణిని వినిపించారు. బలిగంప కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గ్రామస్థులు జాతరలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్



మాట్లాడుతున్న డాక్టర్ ఎం.గోవర్ధన్

దుండిగల్: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంతో పాటు సమగ్ర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని జయశంకర్ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్ అన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా గురువారం దుండిగల్ మున్సిపాలిటీ నాగులూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో మెలకువలు, పాడి పంట, చీడ పీడలను తట్టుకునే రకాల గురించి వివరించారు. అదే విధంగా రైతులు పంటలు వేసే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మట్టి నమూనాల పరీక్షల ఆవశ్యకత, వరిలో ప్రధాన ఎరువుల వినియోగం, డ్రమ్ సీడర్ పద్ధతితో వ్యవసాయ సాగు, సేంద్రియ ఎరువుల వాడకం తదితర అంశాలపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.యాదగిరి, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సి.వి సమీర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.శైలజ, రైతులు భరత్‌కుమార్, సుధాకర్, దేవేందర్, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువును మురికికుంటగా మార్చకండి

- అధికారులతో చిన్నరాయుని చెరువు పరిశీలన
- చెరువు అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి
- మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: చెరువులలో డ్రైనేజీ వదిలి మురికికుంటగా మార్చొద్దని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం అధికారులను ఆదేశించారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని చిన్నరాయిని చెరువును అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మచ్చబొల్లారం, అల్వాల్‌లలో నిర్మించిన గొలుసు కట్టు చెరువులు తాగు, సాగునీటి అవసరాలకు ఉపయోగపడ్డాయని అన్నారు. నేడు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ చెరువులు మురికికూపాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో మురుగు చేరకుండా మళ్లించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. కేవలం వరద నీరు చెరువుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు పరీవాహక ప్రాంతంలో భూములు ఉన్న వారికి ఇబ్బంది ఏర్పడితే ప్రభుత్వంతో మాట్లాడి టీడీఆర్ లభించేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

చెరువులో చెత్త వేయకుండా అధికారులు చూడాలి...

చెరువులోని నీరు బయటకి వెళ్లే మార్గంలో కొందరు కావాలనే బండరాళ్లు వేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే వాటిని తొలగించాలని అధికారులకు ఆయన సూచించారు. చెరువులో చెత్తాచెదారం, భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు. చెరువుల్లో గుర్రపుడెక్కను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేసి చిన్నరాయుని చెరువు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. చెరువు అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా తాను చొరవ తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, ఇరిగేషన్ డీఈ శుక్లజా, ఏఈ సుధీర్, జీహెచ్‌ఎంసీ డీఈ ప్రశాంతి, ఏఈ వరుణ్‌దేవ్, జలమండలి డీజీఎం సాంబయ్య, ఏఈ కృష్ణమాచారి, డిప్యూటీ తహసీల్దార్ పద్మకుమార్, ఆర్ఐ రమ్య, నాయకులు పాల్గొన్నారు.



బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వడ్డె రాజు

ఘట్‌కేసర్: రెండు బైక్‌లు ఎత్తుకెళ్లిన కేసులో నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ శ్రీనివాస్ సమాచారం మేరకు... గద్వాల్ జిల్లా దారూర్‌కు చెందిన వడ్డే రాజు ఘట్‌కేసర్‌లోని అయ్యప్ప బైక్ పాయింట్ దగ్గర నిలిపిన గ్లామర్ బైక్ ఏపీ 29 ఈడబ్ల్యూ–6112, లక్ష్మీ వైన్స్ దగ్గర నిలిపిన ప్యాషన్ ప్రో బైక్ టీఎస్ 08ఈటీ 8027ను ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మేడ్చల్: డబీల్‌పూర్ చౌరస్తా సమీపంలో చెట్ల పొదల్లో మేడ్చల్ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని కనుగొన్నారు. అనారోగ్య సమస్యలు, ఆహారం లేకపోవడంతో ఆ వ్యక్తి మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం లభ్యమైన ప్రాంతం సమీపంలో ఉన్న శ్రీరామ స్పిన్నింగ్ మిల్ సెక్యూరిటీ గార్డు వద్దకు బుధవారం మృతి చెందిన వ్యక్తి వెళ్లి ఆహారం కోసం అడిగినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మేడ్చల్ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రైవేట్ బస్సు దగ్ధం



దగ్ధమవుతున్న బస్సు

మేడ్చల్: జాతీయ రహదారిపై ఓ ప్రైవేటు బస్సు దగ్ధమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఓ కంపెనీకి ఉద్యోగులను తీసుకెళ్లే బస్సు గురువారం ఉదయం సిద్దిపేట జిల్లా, బస్వాపూర్ నుంచి కొంపల్లి వైపు వెళుతోంది. బస్సు పట్టణంలోని రహదారి బంగ్లా సమీపంలోకి చేరుకోగానే ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన ఆపి కిందకు దిగాడు. మంటలు వ్యాపించడంతో బస్సు పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

మేడ్చల్: మేడ్చల్ సహకార సంఘంలో అధికారులు కుంటి సాకులు చూపుతూ రైతులు పండించిన వరి ధాన్యంను కొనుగోలు చేయచడం లేదని నిరసిస్తూ సంఘం పరిధిలోని రైతులు సంఘ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. వివిధ గ్రామాల రైతులు అధికారుల పాలకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం నిర్వహిస్తున్న అధికారులు రైతులు సొసైటీకి తీసుకొచ్చిన రైతులకు ఏదో ఒక కుంటి సాకు చూపుతూ ధాన్యం తీసుకోవడం లేదని అన్నారు. తేమ శాతం, తాలు శాతం అంటూ సవాలక్ష వంకలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారి అర్చన, సంఘం చైర్మన్ రణదీప్‌రెడ్డి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులతో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, సుకుందర్‌రెడ్డి, మురళీగౌడ్ పాల్గొన్నారు.

ఈస్ట్‌మారుతీనగర్ సమస్యలు పరిష్కరిస్తాం



సమస్యలపై ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మౌలాలి: డివిజన్ పరిధిలోని ఈస్ట్‌మారుతీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం ఆయన పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన డ్రైనేజీ వ్యవస్థ, వరదనీటి కాలువలు, సీసీరోడ్లు, పార్కుస్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించాలని కాలనీవాసులు కోరారు. అదేవిధంగా సీసీ కెమెరాలు, వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలని కోరారు. దశలవారీగా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ మహేష్, ఏఈ మధురిమ, జలమండలి మేనేజర్ నవీన్, వీధిదీపాల ఏఈ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు అమీరుద్దీన్, వంశీముదిరాజ్, సంతోష్‌గుప్తా, రాజశేఖర్, ఈస్ట్‌మారుతీనగర్ అధ్యక్ష,కార్యదర్శులు కుమార్, మాధవాచారి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల ముంపు సమస్యను పరిష్కరించండి

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డికి వినతి



డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ మురుగేష్

మల్కాజిగిరి: బండచెరువు కింది ప్రాంతంలో ఉన్న కాలనీలు ముంపునకు గురవుతున్నాయని.. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ కార్పొరేటర్ మురుగేష్ విజ్ఞప్తి చేశారు. వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి ఆయన గురువారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురుగేష్ మాట్లాడుతూ... సఫిల్‌గూడ చెరువు, బండచెరువు పై ఉన్న వినాయకనగర్, చంద్రగిరికాలనీల నుంచి వచ్చే వర్షపునీరు బయటకు వెళ్లడానికి బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఎన్‌ఎండీసీ కాలనీ నుంచి జెటీసీ క్రాస్‌రోడ్స్ మీదుగా లాలాపేట్ వరకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణంతో సమస్య పరిష్కారం అవుతుందని ఆమెకు వివరించామని తెలిపారు. సత్తిరెడ్డినగర్ వద్ద బాటిల్ నెక్ నాలాను సరిచేయడానికి తార్నాక డివిజన్ లక్ష్మీనగర్ వరకు నిర్మిస్తున్న బాక్స్ డ్రెయిన్‌ను సత్తిరెడ్డినగర్ కాలనీ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశామన్నారు. దశాబ్దాలుగా ముంపు సమస్య ఎదుర్కొంటున్నారని ఈ రెండు బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిదికన చేపట్టాలని విజ్ఞప్తి చేశామన్నారు. త్వరలోనే ఈ రెండు ప్రాంతాల్లో పర్యటించి తదుపరి చర్యలు తీసుకుంటానని డిప్యూటీ మేయర్ హామీ ఇచ్చారని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో ప్రభాకర్‌గౌడ్, రామ్మోహన్, సుభాష్, గోపీనాథ్, పిట్ల శ్రీనివాస్, ఇప్పల వెంకటేష్ ఉన్నారు.

బండారి రాజిరెడ్డి సేవలు మరువలేనివి

మల్లాపూర్: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలు మరువలేనివని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మల్లాపూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మపురి కాలనీలో సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బండారి లక్ష్మారెడ్డి హాజరై నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తుదిశ్వాస వరకు ప్రజల కోసమే ఆలోచించిన వ్యక్తి రాజిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, రెడ్డి సంఘం నేతలు రాజిరెడ్డి, దోమశ్రీనివాస్‌రెడ్డి, ముత్యంరెడ్డి, దర్గారెడ్డి, హమాలీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.